క్లుప్తంగా

కారులో మంటలు.. తప్పిన ప్రమాదం

సూర్యాపేట : ప్రయాణిస్తున్న ఓ కారులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కారు దగ్ధమైంది. ఈ సంఘటన బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్‌కు చెందిన గోపాలరావు అతడి కుటుంబ సభ్యులు పనినిమిత్తం సూర్యాపేటకు వస్తుండగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోకి రాగానే కారులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమై కారులో ప్రయాణిస్తున్న నలుగురు దిగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఎండ తీవ్రతతో కారులో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించి ఉండవచ్చని ఫైర్ సిబ్బంది భావిస్తున్నారు. ఎవరికి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

సీఎంఆర్ అందించాలి



మిల్లు యజమానితో మాట్లాడుతున్న ఆర్డీఓ

నూతనకల్ : ప్రభుత్వానికి మిల్లర్లు వెంటనే కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అందజేయాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామంలోని మమత రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిల్లులకు కేటాయించిన ధాన్యానికి సంబంధించి మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను వెంటనే ప్రభుత్వానికి అందజేయాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీటీ విజయశేఖర్, తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఆర్ఐ ప్రసాద్, మిల్లు యాజమాని అనుష్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

అర్వపల్లి : ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లే కూలీలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఓ చిలుక ఉపేందర్ కోరారు. బుధవారం కోడూరులో ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో తాగు నీరు, నీడ వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. కూలీలు కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 కూలీ వస్తుందన్నారు. కార్యక్రమంలో ఈసీ నగేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

చివ్వెంల : స్వాతి నక్షత్రం పురస్కరించుకొని మండల పరిధిలోని ఉండ్రుగొండ గిరిదుర్గంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి వేదపండితులు శ్రీపవనకుమార చార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీదేవి, భూదేవిలతో వైభవంగా కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బండకవి క్రిష్ణమోహన్, మధుసూదన్‌రావు, యలగబోయిన శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

అర్వపల్లి : జిల్లాలో యాసంగి సీజన్ నందు సెర్ప్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 65 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు చెప్పారు. బుధవారం అర్వపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యానికి ఎప్పటికప్పుడు కాంటాలు వేయాలని సూచించారు. డాటా ఎంట్రీ కూడా త్వరగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కాంటాలైన ధాన్యాన్ని మిల్లులకు పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వలిశెట్టి మల్లేష్, సీసీ నగేష్, వీఓఏ కృష్ణకుమారి, సంఘబంధం అధ్యక్షురాలు మేకల సునీత, కార్యదర్శి గుడిసె రమణ, ఉపాధ్యక్షురాలు సంధ్య, వీరమ్మ పాల్గొన్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



చల్ల కళ్యాణి, అనంతారం, (ఎంపీసీ, 969)



కె.సౌమ్య, అనంతారం, (బైపీసీ, 856)




ఎస్.నిహారిక, అనంతారం, (సీఈసీ, 771)



రోహిత్, అనంతారం, (ఎంపీసీ, 448)



దేగల రాము, ఆత్మకూర్(ఎస్), (ఎంపీసీ, 981)



ఎన్.సాయిక్రిష్ణ, పసునూర్, (ఎంపీసీ, 949)



టి. భూమిక, పసునూర్, (ఎంపీసీ, 919)



జి. రాహుల్, పసునూర్, (బైపీసీ, 929)



సాయిమనోజ్, తుంగతుర్తి, (ఎంపీసీ, 976)



శివకుమార్, తుంగతుర్తి, (ఎంపీసీ, 970)



కె. మనీషా, పసునూర్, (బైపీసీ, 921)



పి. ఉజ్వల, పసునూర్, (ఎంపీసీ, 407)

సూర్యాపేటటౌన్ : ఇంటర్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన ఎల్ఎండీటీ ఒకేషనల్ కోర్సులో సాధియ 500 మార్కులకు గాను 488 మార్కులు సాధించింది. సీహెచ్.హర్షిత్ ఎంఎల్‌టీ విభాగంలో 461 మార్కులు, ఎంపీసీ విభాగంలో ఇస్మాయిల్ జాన్ 421 మార్కులు, బి.భార్గవి 385 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బైపీసీలో కె.అఖిల 385 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఈటీ ఒకేషనల్ కోర్సులో ఎస్.శంకరాచారి 978, ఎంపీసీలో బి.జ్యోతిర్మయి 930, హెచ్ఈసీలో సీహెచ్.తేజస్వీని 929 మార్కులు సాధించినట్లు చెప్పారు.

ఇమాంపేటలో కార్పొరేట్ స్థాయి ఫలితాలు

ఇమాంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కార్పొరేట్ స్థాయిలో ఫలితాలు సాధించడం పట్ల ప్రిన్సిపల్ శంకర్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో శీలం మధుమిత బైపీసీలో 957 మార్కులు, మట్టిపల్లి శృతి ఎంపీసీలో 944 మార్కులు, మెంతబోయిన హర్షిత బైపీసీలో 946 మార్కులు, గుగులోతు బిందు ఎంపీసీలో 933 మార్కులు, మహమ్మద్ సదాబేగం సీఈసీలో 928 మార్కులు, ఆంగోతు దివ్య బైపీసీలో 925 మార్కులు, మట్టిపల్లి తేజస్వి బైపీసీలో 915 మార్కులు, హుందావత్ వైష్ణవి బైపీసీలో 905 మార్కులు, బొల్లం దీప్తి ఎంపీసీలో 899 మార్కులు, బాదావత్ అరుణ ఎంపీసీలో 878 మార్కులు, మారోజు ఉపేంద్రచారి సీఈసీలో 877మార్కులు, ఇటికాల నందిని సీఈసీలో 812మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో బుసిగంపుల ఇందు ఎంపీసీలో 459 మార్కులు, లింగోజు సాత్విక ఎంపీసీలో 445 మార్కులు, ఆరిగే ఇందు ఎంపీసీలో 445 మార్కులు, చాగంటి భవాని ఎంపీసీలో 439 మార్కులు, షేక్ సమీర్ అహ్మద్ ఎంపీసీలో 436 మార్కులు, రాగం మహాలక్ష్మి బైపీసీలో 409 మార్కులు, జాల మానస బైపీసీలో 395 మార్కులు, మర్పల్లి నవ్య బైపీసీలో 386 మార్కులు సాధించారు.

తిరుమలగిరి : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అనంతారం మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వేముల బాలరాజు తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో చల్ల కళ్యాణికి 969 మార్కులు, బైపీసీలో కూటికంటి సౌమ్యకు 856 మార్కులు, సీఈసీలో నిహారికకు 771 మార్కులు వచ్చినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో రోహిత్ 448 మార్కులు, బైపీసీలో ఎం.రేష్మ 417 మార్కులు, సీఈసీలో పి.అంజలి 343 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఆత్మకూర్ 'మోడల్' విద్యార్థుల ప్రభంజనం

ఆత్మకూర్(ఎస్) : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన కవలలు సత్తా చాటారు. మండల కేంద్రానికి చెందిన డేగల లక్ష్మణ్, రాము మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎంపీసీలో కళాశాల టాపర్‌లుగా నిలిచారు. లక్ష్మణ్ 983 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా 981 మార్కులతో రాము రెండవ స్థానంలో నిలిచాడు. బైపీసీలో జయరాం రక్షిత్ 912 మార్కులు సాధించగా, సీఈసీలో యమున 719 మార్కులు సాధించారు. కాగా ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 29శాతం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 69మంది విద్యార్థులు పరీక్ష రాయగా 20మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 78మంది పరీక్ష రాయగా 63 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి తెలిపారు. నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత స్థాయి భారీగా పడిపోయింది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 84 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 42 మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 68 మంది పరీక్ష రాయగా 40 మంది ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూలో ప్రథమ సంవత్సరంలో 29 మందికి 26 మంది, ద్వితీయ సంవత్సరంలో 38 మందికి 32 మంది ఉత్తీర్ణత సాధించగా.. స్రవంతి 961 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది.

కస్తూరిబా విద్యార్థినుల ప్రతిభ



జి.మౌనిక, చివ్వెంల, (ఎంపీహెచ్‌డబ్ల్యూ, 477 మార్కులు)



లక్ష్మీ ప్రసన్న, చివ్వెంల, (ఎంపీహెచ్‌డబ్ల్యూ, 911 మార్కులు)

చివ్వెంల : ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 21 మంది విద్యార్థులకు గాను 14 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 23 మంది విద్యార్థులకు 15 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డి.నాగలక్ష్మి తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో ప్రథమ సంవత్సరంలో కళాశాలకు చెందిన గండికోట మౌనిక 500 మార్కులకుగాను 477 సాధించింది. అదే విధంగా ద్వితీయ సంవత్సరంలో పెండెం లక్ష్మీప్రసన్న ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగంలో 1000 మార్కులకు 911 సాధించింది.

పసునూర్ విద్యార్థులకు ఉత్తమ మార్కులు

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. మోడల్‌స్కూల్ విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 50శాతం, ద్వితీయ సంవత్సరంలో 62శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో భూక్య నందిని 383/470, లకావత్ వరుణ్ 375/470, బైపీసీ విభాగంలో పాల్వాయి ఉజ్వల 407/ 470, ఉలిమిపూటి వంశీ 393/470, అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో నిమ్మగూరి సాయిక్రిష్ణ 949/1000, తోట భూమిక 919/1000, బైపీసీ విభాగంలో గుండాల రాహుల్ 929/1000, కొమ్ము మనీషా 921/1000 మార్కులు సాధించినట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కుంట రమేష్‌కుమార్ తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల హవా

తుంగతుర్తి : ఇంటర్ ఫలితాల్లో టీఎస్ ఆర్ఎస్ గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విభాగంలో 100% ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ శేఖర్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో ఎం. సాయి మనోజ్ 976/1000, ఎస్.శివకుమార్ 970/1000 మార్కులు పొందినట్లు తెలిపారు. ఇంటర్ సెకండియర్ బైపీసీ విభాగంలో బి.గణేష్ 971/1000, కె.దత్తు 946/1000 మార్కులు సాధించి ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో జి.శశికిరణ్ 466/470, జె.మచ్చగిరి 463/470, ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో పి.కళ్యాణ్ రామ్ 436/440, రాంప్రసాద్ 403/470 మార్కులు సాధించారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ద్వితీయ సంవత్సరంలో 67%, ప్రథమ సంవత్సరంలో 39% ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ విభాగంలో పోడేటి త్రిష 943/1000 మార్కులు పొందారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి ఒకేషనల్ విభాగంలో ద్వితీయ సంవత్సరంలో శృతి 979/1000, ప్రథమ సంవత్సరంలో సంజన 486/500 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్యామలత తెలిపారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి ద్వితీయ సంవత్సరం బైపీసీలో రజిని 939/1000, శైలజ 928/1000, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బి.యాకమ్మ, ప్రియాంకలు 863/1000, మానస 852/1000 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నీలారాణి తెలిపారు.

పెన్‌పహాడ్ మండలంలో..



కల్పన, పెన్‌పహాడ్, (ఎంపీసీ, 412)



నందుశ్రీ, పెన్‌పహాడ్, (బైపీసీ, 363)

పెన్‌పహాడ్ : ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, కళాశాల, అనాజిపురం ఆదర్శ పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేజీబీవీలో మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో కల్పన 412 మార్కులు, ఎం. అంజలి 384 మార్కులు, బైపీసీ విభాగంలో నందుశ్రీ 363మార్కులు, స్పందన 386 మార్కులు సాధించారు. ఆదర్శ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎస్.శ్రావణి 380 మార్కులు, బైపీసీ విభాగంలో బి. శ్రవంతి 420 మార్కులు, సీఈసీ విభాగంలో అర్చన 435 మార్కులు సాధించారు. ఇంటర్ రెండో సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో ఇందు ప్రసన్న 939మార్కులు, బైపీసీలో జి. మౌనిక 791మార్కులు, సీఈసీలో సీహెచ్ ప్రసన్న 795మార్కులు సాధించినట్లు కేజీబీవీ ఎస్ఓ ఆసియా జబిన్, ప్రిన్సిపల్ ప్రమీల తెలిపారు.



శ్రావణి, అనాజిపురం, (ఎంపీసీ, 380)



శ్రవంతి, అనాజిపురం, (బైపీసీ, 420)



ఇందు ప్రసన్న, అనాజిపురం, (ఎంపీసీ, 939)



మౌనిక, అనాజిపురం, (బైపీసీ, 791)

కేసీఆర్ రోడ్‌షో సైడ్‌లైట్స్..

భానుపురి :

- సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల వద్దకు 8.50గంటలకు మాజీ సీఎం కేసీఆర్ కాన్వాయ్ చేరుకుంది.
- ఎస్వీ డిగ్రీ కళాశాల నుంచి పోస్టాఫీస్ వరకు రోడ్డుకు ఇరువైపులా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పూలు చల్లుతూ కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు.
- ప్రత్యేక గోండ్రు నృత్యాలు ఆకట్టుకున్నాయి.
- ఎస్వీ డిగ్రీ కళాశాల నుంచి కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా మీదుగా పోస్టాఫీస్ వద్దకు 9గంటల 12 నిమిషాలకు కేసీఆర్ చేరుకున్నాడు.
- ఎస్వీ డిగ్రీ కళాశాల నుంచి పోస్టాఫీస్ వద్దకు కేసీఆర్ చేరుకునేంత వరకు పార్టీ శ్రేణులు బాణ సంచాలు భారీ ఎత్తున కాల్చారు
- పోస్టాఫీస్ వద్దకు చేరుకున్న బస్సు యాత్రలో 9గంటల 16 నిమిషాలకు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ ప్రసంగాన్ని ప్రారంభించారు.
- పోస్టాఫీస్ చౌరస్తాలో కేసీఆర్ తన ప్రసంగాన్ని 9గంటల 20 నిమిషాలకు ప్రారంభించారు.
- కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించగానే పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున లీడర్, లీడర్ అంటూ కేకలు వేశారు.
- కేసీఆర్ తన ప్రసంగం చివరి నిమిషంలో హిందీలో పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.
- కేసీఆర్ తన ప్రసంగాన్ని 9 గంటల 38 నిమిషాలకు ముగించారు.
- కేసీఆర్ తన ప్రసంగం అనంతరం పోస్టాఫీస్ నుంచి బస్సులో పూలసెంటర్ మీదుగా పీఎస్సార్ సెంటర్ నుంచి శంకర్ విలాస్ సెంటర్ మీదుగా నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి 9 గంటల 53 నిమిషాలకు చేరుకున్నారు.
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ రాత్రి బస సందర్భంగా పోలీసులు క్యాంపు కార్యాలయం పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోస్టాఫీస్ వద్దకు చేరుకున్న కేసీఆర్ బస్సుయాత్ర

భారీ బందోబస్త్..

సూర్యాపేట : మాజీ సీఎం కేసీఆర్ బస్సుయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సూర్యాపేట డీఎస్పీ జి.రవి ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. సూర్యాపేట పట్టణంలోని నాలుగు దిక్కుల్లో సీఐలు, ఎస్ఐలతో బందోబస్త్ నిర్వహించారు. అదే విధంగా పోస్టాఫీస్ చౌరస్తాలో ట్రైనీ ఎస్పీ రాజేష్‌మీనా బందోబస్తు తీరును పరిశీలించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

నూతనకల్ : కాంగ్రెస్ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ తాడూరి లింగయ్య, మాజీ ఎంపీటీసీ నకిరేకంటి అనసూర్యవెంకన్న, బద్దం వెంకట్‌రెడ్డి, అనంతుల వెంకన్నగౌడ్, బాణాల లింగారెడ్డిల ఆధ్వర్యంలో సుమారు 60మంది తిరుమలగిరిలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, కల్లెం కృష్ణారెడ్డి, బండపల్లి సాగర్, నకిరేకంటి మధు, పల్సా లింగయ్య, అంజయ్య, జయాకర్, అంబేడ్కర్ పాల్గొన్నారు.



నాగారం : తిరుమలగిరిలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కార్యకర్తలు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నాగారం : వర్ధమానుకోట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ బోయిని శోభాలింగమల్లు తన అనుచరులతో కలిసి తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బోయిని శోభలింగమల్లుతో పాటు మరో 100 మందిని ఎమ్మెల్యే మందుల సామేల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్, పాశం యాదవరెడ్డి, గుంటకండ్ల అశోక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బత్తుల కర్ణాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తిరుమలగిరి : కాంగ్రెస్ పార్టీ మాజీ మండల శాఖ అధ్యక్షుడు నెమురుగొమ్ముల ప్రతాపరావు తండ్రి ప్రభాకర్‌రావు ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులను తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పేరాల వీరేష్, జమ్మిలాల్, ఎస్.శాతవాహనరావు, నాగరాజు, రామాంజయ్య, సుంకరి జనార్దన్, గోపాల్‌రెడ్డి, రామారావు, రాము గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరి : ప్రభాకర్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

పశువుల సంరక్షణపై అవగాహన

పెన్‌పహాడ్ : పశువుల సంరక్షణకు రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి యర్రంశెట్టి కిరణ్‌కుమార్ అన్నారు. వేసవిలో పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం మండల పరిధిలోని అనంతారం, దూపహాడ్ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు.

బాధితుడికి పరామర్శ

అర్వపల్లి : మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన రైతు కాసం మల్లయ్య రెండు రోజుల కిందట పాముకాటుకు గురై సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో బాధితుడిని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ అభిషేక్‌రెడ్డి పరామర్శించారు. సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చులు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎస్‌కే. రషీద్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నిద్ర సంపత్‌నాయుడు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

అర్వపల్లి : భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపు కోసం బీజేపీ నాయకులు అర్వపల్లిలో బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు నల్లగుంట్ల నరేష్, బీజేపీ మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్, జిన్న అశ్విన్, చవ్వ సురేష్, బైరబోయిన నాగయ్య, లింగంపల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని మొర్సకుంట తండా ఆవాసం నూర్జహాన్ పేట గ్రామానికి చెందిన గుగులోతు మంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మృతురాలి కుమారుడైన గుగులోతు సురేష్ స్నేహితులు, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం బాధిత కుటుంబానికి రూ. 16వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రంజాన్, మహేందర్, సైదులు, కృష్ణ, గులాం, హుస్సేన్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి



తిరుమలగిరిలోని కొనుగోలు కేంద్రంలో తూకాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

తిరుమలగిరి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం వచ్చిన ధాన్యానికి వెంటనే కాంటాలు వేయించాలని, ధాన్యం బస్తాలను లారీలలో మిల్లులకు తరలించే విధంగా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ లత కోరారు. సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కాంటాలు ఆలస్యం– రైతుల నిరీక్షణ కథనానికి స్పందించి అదనపు కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ మోహన్ బాబు, ఏఎస్ఓ పుల్లయ్య, తహసీల్దార్ సుధ, డీటీసీ విజయ్‌శేఖర్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎం సైదులు తదితరులు పాల్గొన్నారు.

సంకినేని సమక్షంలో బీజేపీలో చేరిక

తుంగతుర్తి : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు సమక్షంలో బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు, మార్కెట్ డైరెక్టర్ పూసపెల్లి శ్రీనివాస్, బండరామారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గడ్డం ఉప్పలయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ సంకినేని బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే బీజేపీతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్ రావు, బీజేపీ రాష్ట్ర నాయకులు సంకినేని రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరుతున్న కార్యకర్తలు

సంక్షిప్త సమాచారం

బొడ్రాయి ఉత్సవాలు ప్రారంభం

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో బొడ్రాయి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుడు వేణుగోపాల చార్యులు గ్రామపెద్దలతో గణపతి పూజ, నవగ్రహ పూజలను నిర్వహించారు. అదే విధంగా నాభిశిలతో పాటు నూతనంగా ప్రతిష్ఠించబోయే గ్రామ దేవతల విగ్రహాలను, శివలింగాన్ని ఊరేగించారు.

అదనపు కొనుగోలు కేంద్రం మంజూరు

అర్వపల్లి : కొమ్మాలలో ఒకే కొనుగోలు కేంద్రం ఉండటం.. కేంద్రానికి భారీగా ధాన్యం వస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం అమ్ముకోవడానికి రోజుల తరబడి అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. ఈ విషయమై అదనపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయరూ.. అనే శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు జాజిరెడ్డిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు జిల్లా సహకార అధికారిణి ఎస్. పద్మ అనుమతిచ్చారు. గురువారం నుంచి గ్రామంలో పీఏసీఎస్ కేంద్రం నందు కొనుగోళ్లు ప్రారంభంకానున్నాయి.

ద్విచక్ర వాహనం చోరీ

సూర్యాపేట : సూర్యాపేటలో పట్టపగలు ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసిన 15 నిమిషాల్లోనే గుర్తు తెలియని వ్యక్తి అపహరించారు. సూర్యాపేటకు చెందిన రవి అనే వ్యక్తి పాపులర్ షూ మార్ట్ దుకాణంలో షూ కొనుగోలు చేసి తిరిగి బయటికి వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా ద్విచక్ర వాహనం చోరీకి గురైన దృశ్యాలు రికార్డు అయ్యాయి.

ట్రాక్టర్, బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

చివ్వెంల : ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులోని సూర్యాపేట-ఖమ్మం రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం గోల్‌తండా గ్రామానికి చెందిన నాగులు నాయక్ తన సొంత పనుల నిమిత్తం సూర్యాపేటకు బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బీబీగూడెం గ్రామ శివారులో వ్యవసాయ పొలాలకు ఎరువు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ రాంగ్ రూట్‌లోకి ఒక్కసారిగా మళ్లడంతో బైక్ ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న నాగులు తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

నగదు, బంగారం చోరీ

నూతనకల్ : ఎర్రపహాడ్ గ్రామంలోని ఓ ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ జె.సైదులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అనంతుల మహేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్న సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అతడు తిరిగి ఇంటికి వచ్చే సరికి కిటికీలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న లక్ష నగదు, నాలుగున్నర తులాల బంగారు హారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని తుంగతుర్తి సీఐ శ్రీను పరిశీలించారు.

26న మానస దేవి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

భానుపురి : పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో ఈ నెల 26న నూతనంగా మానసా దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ సంతోషిమాత దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూకా వెంకటేశంగుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్ తెలిపారు. బుధవారం దేవాలయంలో మానస దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కరపత్రాలను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెన్‌పహాడ్ : చీదెళ్ల సబ్ స్టేషన్ పరిధిలోని నూర్జహాన్ పేటలో ఫీడర్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున గురువారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు నూర్జహాన్‌పేట, గూడెపుకుంట తండాలకు విద్యుత్‌లో అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జ్ ఏఈ రమేష్ బుధవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు శ్రీచాంపూలాల్ జాతర

చివ్వెంల : పులితండాలో గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీచాంపూలాల్ జాతర గురు, శుక్రవారం రెండు రోజుల పాటు జరుగనుంది. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి తర్వాత జరిగే ఈ జాతర సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. జాతరకు జిల్లా నుంచే కాకుండా ఖమ్మం, మహబూబ్ నగర్, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల నుంచి గిరిజనులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.